
www.prajasakti.com

ప్రజాశక్తి

సోమవారం 3 ఫిబ్రవరి 2025



నేడు డిప్యూటీ మేయర్ ఎన్నిక

- కూటమిలోకి వైసిపి కార్పొరేటర్
- వైసిపి డిప్యూటీ మేయర్ అభ్యర్థిగా లడ్డు భాస్కర్ రెడ్డి ఖరారు
- కూటమి అభ్యర్థిగా ఆర్‌సి మునికృష్ణ ?
- గెలుపు తమదేనంటున్న టిడిపి, జనసేన

ప్రజాశక్తి -తిరుపతి టౌన్: తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్ డిప్యూటీ మేయర్ పదవికి సోమవారం ఎస్‌వి సెనేట్ హాల్లో ఎన్నికలు నిర్వహించనున్నారు. జాయింట్ కలెక్టర్ శుభం బన్సల్ ఎన్నికల అధికారిగా వ్యవహరించనున్నారు. ఉదయం 11 గంటలకు ఎన్నికలు నిర్వహిస్తారు. వైసిపి డిప్యూటీ మేయర్‌గా 42వ డివిజన్ కార్పొరేటర్ శేఖర్ రెడ్డి పేరును నాలుగు రోజుల క్రితం ప్రకటించారు. అయితే కూటమి పార్టీ నేతలు ఆయన ఆస్తులపై దాడులు చేయడంతో ఆ ఒత్తిడి భరించలేక జిల్లా మంత్రి అనగాని సత్య ప్రసాద్‌ను కలిసి టిడిపిలో చేరుతున్నట్లు ప్రకటించారు. దీంతో వైసిపి అధిష్టానం డిప్యూటీ మేయర్ అభ్యర్థిగా మరొక కార్పొరేటర్ లడ్డు భాస్కర్ రెడ్డి పేరును ఖరారు చేశారు. టిడిపి నుంచి 35వ డివిజన్ కార్పొరేటర్ ఆర్‌సి మునికృష్ణ పేరు ఖరారు చేసే అవకాశం వుంది. ఇక్కడ 25వ డివిజన్ కార్పొరేటర్‌గా వైసిపి నుంచి గెలిచి జనసేనలో చేరిన నరసింహాచారి పేరు కూడా కూటమి పార్టీలో డిప్యూటీ మేయర్ అభ్యర్థిగా ఆశిస్తున్నారు. అయితే టిడిపి నేతలు మాత్రం కార్పొరేటర్ ఆర్‌సి మునికృష్ణను ప్రతి పాదించే అవకాశాలు ఉన్నట్టు సమాచారం. ఈ అర్ధరాత్రి ఆయన పేరును ప్రకటించే అవకాశాలు ఉన్నాయి.



వైసిపి అభ్యర్థి లడ్డు భాస్కర్‌రెడ్డి

అనుకూలంగా మార్చుకున్న కూటమి నేతలు

తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్ లో కూటమి పార్టీ నేతలకు బలం లేకపోయినా డిప్యూటీ మేయర్ పదవి కోసం వైసిపి కార్పొరేటర్లపై ఒత్తిడి తీసుకొచ్చి కూటమి నేతలను అనుకూలంగా తమ వైపు మార్చుకున్నారు. ముఖ్యంగా జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి అనగాని సత్య ప్రసాద్ ఆదేశాల మేరకు తిరుపతి టిడిపి నేతలు మబ్బు దేవ నారాయణ రెడ్డి, జనసేన నేత ప్రముఖ నిర్మాత ఎన్ వి ప్రసాద్ నేతృత్వంలో వైసిపి కార్పొరేటర్లపై ఒత్తిడి తీసుకొచ్చి కూటమి అభ్యర్థికి మద్దతుగా ఓట్లు వేసి గెలిపించాలని వైసీపీ కార్పొరేటర్లకు సూచించారు. తమిళనాడు, పాండిచ్చేరి రిసార్ట్‌లో ఉన్న 30 మంది వైసీపీ కార్పొరేటర్లు ఒక్కొక్కరు వైసీపీ అధిష్టానానికి తెలియకుండా కూటమి నేతలతో రహస్యంగా కలిశారు. తిరుపతి మాజీ ఎమ్మెల్యే భూమన కరుణాకర్ రెడ్డి అనుచరుడుగా చెప్పుకుంటున్న మరో డిప్యూటీ మేయర్ ముద్ర నారాయణ అసెంబ్లీ ఎన్నికల తర్వాత కూటమి పార్టీ నేతలతో తిరుగుతున్నారు. మరో ముఖ్యమైన కార్పొరేటర్ ఎస్కే బాబు కూడా జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి అనగాని సత్యప్రసాద్‌ను కలిశారు. ప్రస్తుతం కూటమి డిప్యూటీ మేయర్ అభ్యర్థికి 26 మంది కార్పొరేటర్లు మద్దతు పలుకుతున్నట్లు సమాచారం. మరో నలుగురు వైసిపి కార్పొరేటర్లు కూడా కూటమి అభ్యర్థికి మద్దతు ప్రకటించే అవకాశం వుంది. వైసీపీ నుంచి కూటమిలో వచ్చిన కార్పొరేటర్లను రహస్య ప్రాంతాలకు తరలించారు. సోమవారం ఉదయం వీరిని ఎస్‌వి సెనేట్ హాలు కు తీసుకొచ్చి ఓటింగ్ ప్రక్రియ పూర్తయిన తర్వాత బయటికి తీసుకొచ్చే అవకాశం వుంది. అయితే ఆదివారం రాత్రి జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి అనగాని సత్యప్రసాద్ సమక్షంలో పలువురు టిడిపి, జనసేనలో వైసీపీ కార్పొరేటర్లు చేరనున్నారు. వైసిపికి 16 నుంచి 18 మంది కార్పొరేటర్ల బలం మాత్రమే ఉందని నగరంలో ప్రచారం సాగుతోంది. ఎట్టి పరిస్థితిలో కూటమి నేతలు డిప్యూటీ మేయర్ పదవిని వదులుకునే ప్రసక్తి లేదని తమదే డిప్యూటీ మేయర్ సీటు అని కూటమి నేతలు అంటున్నారు. ఈ పదవి గెలిచిన తర్వాత మేయర్ డాక్టర్ శిరీషపై అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టి మేయర్ స్థానాన్ని కూడా కైవసం చేసుకుంటామని టిడిపి, జనసేన నాయకులు ధీమా వ్యక్తం చేస్తున్నారు.

ఎన్నికలు ఇలా..

ఎస్‌వి సెనేట్ హాల్లో నిర్వహించే ఎన్నికల్లో డిప్యూటీ మేయర్ అభ్యర్థులకు ఓట్లు వేయాలంటే కార్పొరేటర్లు చేతులెత్తి పైకెత్తి మద్దతు ఇవ్వాలి. మొదట కూటమి అభ్యర్థులకు చేయి ఎత్తి మద్దతు చూపే కార్పొరేటర్ల సంఖ్యను లెక్కిస్తారు. తర్వాత వైసిపి డిప్యూటీ అభ్యర్థికి ఎంత మంది కార్పొరేటర్లు మద్దతు ఇచ్చి చెయ్యెత్తి చూపుతారో సంఖ్యను లెక్కిస్తారు. ఏ అభ్యర్థికి కార్పొరేటర్లు ఎక్కువ మందికి చేయెత్తి మద్దతు తెలుపుతారో వారు డిప్యూటీ మేయరుగా ఎన్నికైనట్లు ప్రకటిస్తారు. తక్కువ మంది కార్పొరేటర్లు చేయి ఎత్తిన వారిని ఓటమి అభ్యర్థిగా ప్రకటించ నున్నారు.

డిప్యూటీ మేయర్ ఎన్నిక ఏర్పాట్లు పూర్తి: జేసి , ఎన్నికల ప్రిసైడింగ్ అధికారి

ప్రజాశక్తి -తిరుపతి టౌన్: తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో ఖాళీగా ఉన్న డిప్యూటీ మేయర్ ఎన్నికకు ఈ నెల 3వ తేదీ నిర్వహించనున్న ప్రత్యేక సమావేశానికి అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు జెసి, ఎన్నికల నిర్వహణ ప్రిసైడింగ్ అధికారి శుభం బన్సల్ పేర్కొన్నారు. ఈ ఎన్నిక నిర్వహణకు సంబంధించి ఏర్పాట్లను ఆదివారం ఉదయం స్థానిక ఎస్వీ యూనివర్సిటీ సెనేట్ హాలులో జెసి , ఎన్నికల ప్రిసైడింగ్ అధికారి పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సెనేట్ హాలులో డిప్యూటీ మేయర్ ఎన్నికకు ప్రత్యేక సమావేశం నిర్వహణకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని తెలిపారు. ఈ ప్రత్యేక సమావేశం 11 గంటలకు నిర్వహించనున్న నేపథ్యంలో సంబంధిత కౌన్సిలర్లు, ఎక్స్ అఫీషియో సభ్యులు ఉదయం 11 గంటలకు కంటే ముందు సెనేట్ హాలు వద్దకు హాజరు కావాలని, సెల్ ఫోన్లకు అనుమతి లేదని, రిలేటివ్స్‌కు అనుమతి లేదని, ఐడి కార్డు తప్పని సరిగా తీసుకు రావాలని ఎన్నికల నిర్వహణ అధికారి సూచించారు. ఈ కార్యక్రమంలో అదనపు కమిషనర్ చరణ్ తేజ్ రెడ్డి, డిప్యూటీ కమిషనర్ అమరయ్య, స్మార్ట్ సిటీ జిఎం చంద్రమౌళి, ఎస్‌ఈ సురేంద్ర, జిల్లా సమాచార పౌర సంబంధాల అధికారి బాల కొండయ్య, సెక్రటరీ రాధిక, తహశీల్దారు భాగ్యలక్ష్మి , ఇంజినీరింగ్, టౌన్ ప్లానింగ్ అధికారులు పాల్గొన్నారు.



ఎన్నిక ఏర్పాట్లు పరిశీలిస్తున్న ఎన్నికల అధికారి, జెసి శుభం బన్సల్

చోరీ గ్యాంగ్ హాల్‌చల్

- 1.48 కిలో బంగారు అపహరణ
- తిరుపతి వాసుల బెంబేలు

ప్రజాశక్తి -తిరుపతి సిటీ: తిరుపతి రూరల్ ప్రాంతంలో వరుసగా నాలుగు ఇళ్లల్లో చోరీ గ్యాంగ్ యథేచ్ఛగా ఆదివారం భారీ చోరీకి పాల్పడడంతో స్థానికు లకు కంటిమీద కునుకులేకుండా భయాందోళనకు గురి చేసింది. దొంగల భయంతో బెంబేలెత్తుతున్నారు. బాధితుల కథనం మేరకు.. తిరుచానూరు పోలీస్ స్టేషన్ పరిధిలోని సిపిఆర్ విల్లాలో నాలుగు ఇళ్లలో చోరి గ్యాంగ్ చేతివాటం ప్రదర్శించింది. సోలార్ ఫెన్సింగ్ ను కట్ చేసి, ఆపై విల్లా ఇళ్లలోకి ప్రవేశిం చిన దొంగలు 80,81,82,83 నెంబర్లు కల వరుస ఇళ్లను బద్దలు కొట్టి చోరీకి పాల్పడ్డారు. 81 నెంబర్లోని మేఘనాథ రెడ్డి ఇంటిలో పైన నిద్రిస్తుండగా కింద అంతస్తు లోకి చొరబడిన దొంగలు ఒక కేజీ బంగారం ఆపహరించారు. 82 నెంబరులోని దొర ప్లాస్టిక్ కేశవులనాయుడు అల్లుడు ఇంట్లో 48 గ్రాముల బంగారు ఆభరణాలు అపహరించారు. కాగా 80, 83 నెంబరు కలిగిన ఇళ్లను ఇంటి యజమానులు గెస్ట్ హౌస్‌గా విని యోగిం చుకుంటుండంతో అక్కడ అందుబాటులో పరికరాలను దొంగలు తస్కరించారు. విషయం తెలుసుకున్న క్రైమ్ పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని చోరీ ప్రాంతాలను పరిశీలించారు. క్లూస్ టీం ద్వారా వేలిముద్రలు సేకరించారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నారు.



చోరీ ప్రాంతంలో గుమికూడిన ప్రజలు

గాలి కొదిలేశారు..!

- నిరుపయోగంగా ఇళ్ల స్థలాలు
- ఖాళీ ప్రదేశాల్లో పిచ్చి మొక్కలు, విష సర్పాల బెడద
- పట్టించుకోని అధికారులు
- బిక్కుబిక్కు మంటున్న స్థానికులు

ప్రజాశక్తి-బుచ్చినాయుడు కండ్రిగ: భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని ప్రజలు ఈబీసీ దాస్ కాలనీ, మరికొన్ని ప్రాంతాల్లో స్థలాలను కొనుగోలు చేశారు. కొనుగోలు చేసిన వారు కనీసం ఏడాదికి ఒకసారి ఒక్క సారి కూడా వచ్చి స్థలాలను చూసుకోకపోవడంతో ఆయా ఖాళీ స్థలాల్లో చెట్లు, పిచ్చి మొక్కలు పెరిగి చుట్టుపక్కల వారికి తీవ్ర అసౌకర్యం కలిగిస్తోంది. చెత్త కూడా అదే ప్రాంతంలో వేయడంతో దుర్వాసన వెదజల్లుతోందని, వ్యాధులు బారినపడుతున్నామని స్థానికులు వాపోతున్నారు. చెట్లు, గుబురుగా పెరగడంతో విష పురుగులు, పాములు సంచరిస్తున్నాయి. ఖాళీ స్థలాల్లో నీరు నిలిచి దోమలు తీవ్రత అధికమై కంటి మీద కునుక లేకుండా చేస్తున్నాయని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

విష జ్వరాల విజృంభణ

పరిసరాలు పరిశుభ్రత లేకపోవడంతో ప్రజలు విషజ్వరాల బారిన పడుతున్నారు. వచ్చే సంపాదన అంతంత మాత్రంగా ఉంటే దానికి తోడుగా వ్యాధులు బారినపడి వైద్యఖర్చులకే వెచ్చించాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇళ్ల మధ్యలో ముళ్ల చెట్లు పెరిగి ఉన్నప్పటికీ పారిశుధ్య విభాగం అధికారులు ఉంది. పట్టించుకోకపోవడంతో ఆ పరిసరాల్లో పారిశుధ్యం అస్తవ్యస్తంగా మారింది. అధికారులు నిత్యం ఆయా ప్రదేశాల్లో తిరుగుతున్న కనీసం పట్టించుకోకపోవడం బాధాకరమని నివాసితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పారిశుధ్య విభాగం అధికారులు స్పందించి పరిసరాలను పరిశుభ్రతకు సహకరించని నివాసితులకు నోటీసులు ఇవ్వాలని పలువురు కోరుతున్నారు.

విషపురుగుల బెడద

ఖాళీ స్థలాల్లో గుబురుగా పిచ్చి మొక్కలు పెరగడం వల్ల రాత్రి సమయంలో తేళ్లు , పాములు వంటి విషపురుగులు రోడ్డు మీదకు వస్తున్నాయి. పిల్లలు పాఠశాల ట్యూషన్ల నుంచి వచ్చేటప్పుడు భయపడుతున్నారు. శ్రీ సిటీ లాంటి అనే కంపెనీలకు నిత్యం వందలాది మంది కార్మికులు అర్ధరాత్రిలో, ఏ తెల్లవారు జామునో వెళ్లి వస్తుంటారు. వారు ఎలాంటి విషపురుగుల బారిన పడకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని, పరిసరాలు పరిశుభ్రంగా ఉండేలా చూడాలని స్థానికులు కోరుతున్నారు.

చిరుతను బంధించాలి

- విద్యార్థుల ప్రాణాలు కాపాడాలి
- ఎస్‌ఎఫ్‌ఐ నేత అశోక్ కుమార్



ప్రజాశక్తి - క్యాంపస్ : ఎస్వీయూలో గత 2 నెలలకు పైగా సంచరిస్తున్న చిరుతపులిని బందించి తమ ప్రాణాలకు భద్రత కల్పించండి..' అంటూ ఎస్ఎఫ్ఐ నేత అశోక్ కుమార్ అటవీ శాఖ అధికారులను కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయం రాష్ట్రంలో ఎంతో ఘనమైన చరిత్ర కలిగి వుందని, ఎంతో సువి శాలమైన భూభాగం కలిగిన ఎస్వీయూకి నాలుగు వైపులా ప్రహరీ గోడ లేకపోవడం దారుణమైన విషయం అన్నారు. గత ప్రభుత్వం నుంచి కూడా వర్సిటీలో భద్రత సిబ్బంది కొరత స్పష్టంగా కనిపిస్తోందన్నారు. వర్సిటీలోని వివిధ హాస్టల్ వసతి సముదాయాల వద్ద హాస్టల్ ఇన్‌ఛార్జిలు, వాచ్‌మేన్‌లు పూర్తి స్థాయిలో లేక పోవడం విద్యార్థులకు తీవ్రమైన సమస్యగా మారిందని, వర్సిటీలో పోటీ పరీక్షల కోసం విద్యార్థులు, పరిశోధకులు విద్యనభ్యసిస్తున్నారని వారి చదువు లకు భంగం కలిగించే ఇలాంటి భయాందోళన కర చిరుత దాడుల నుంచి రక్షించాలని కోరారు. ఎంతో మంది పాలకులు, రాష్ట్ర నేతలు ముఖ్యమంత్రులు, మంత్రులు ఈ విశ్వవిద్యాలయంలోని పూర్వ విద్యార్థులే అయినా వర్సిటీ సమస్యను పట్టించుకోకపోవడం అన్యాయమన్నారు. అటవీ శాఖ అధికారులు రాత్రి సమయాలలో పెట్రోలింగ్ చేసి చిరుతను బోనులను ఏర్పాటు చేసి బంధించి దూరంగా విడిచి పెట్టాలని కోరారు. డిమాండ్ చేశారు. ప్రధాన గ్రంథాలయం వద్ద చదువుకుం టున్న పోటీ పరీక్షలకు చదువుకుంటున్న విద్యార్థులు పులి సంచరిస్తోందని ప్రత్యక్షంగా చూసి చదువుపై ఏకాగ్రతతో దృష్టి సారించలేక నిరంతరం భయపడుతూ వీధిలైట్ల మధ్యలో చదువుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే చిరుతను పట్టుకుని విద్యార్థులకు భద్రత కల్పించాలని కోరారు.

కంచె ఏర్పాటు చేయాలి

ప్రజాశక్తి - క్యాంపస్ : చిరుత భయం నుంచి రక్షణకు విశ్వవిద్యాలయాల చుట్టూ కంచె ఏర్పాటు చేయాలని ఏపీ బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ పర్చూరు నారాయణ గౌడ్ కోరారు. టీటీడీ, ఎస్వియు, వేదిక్ యూనివర్సిటీ, అటవీ ఉన్నత అధికారులు సమన్వయంతో చుట్టుపక్కల ముళ్ల కంచెను ఏర్పాటు చేసి చిరుత రాకను నిలువరించేందుకు చర్యలు చేపట్టాలని కోరారు.

తిరుమలలో రథ సప్తమికి విస్తృత ఏర్పాట్లు



ప్రజాశక్తి -తిరుమల: తిరుమల శ్రీవారి ఆలయంలో మంగళవారం రథసప్తమి పర్వదినానికి టీటీడీ విస్తృత ఏర్పాట్లు చేపట్టింది. ప్రతి సంవత్సరం మాఘ మాసంలో సప్తమినాడు శ్రీ మలయప్ప స్వామి ఏడు ప్రధాన వాహనాలపై ఊరేగి భక్తులకు దర్శనమిస్తారు. వాహన సేవలు తిలకించేందుకు వచ్చే భక్తులు చలికి, ఎండకు, వర్షానికి ఇబ్బందులు పడకుండా నాలుగు మాడ వీధుల్లోని గ్యాలరీల్లో జర్మన్ షెడ్లు ఏర్పాటు చేశారు. శ్రీవారి భక్తులకు నిరంతరాయంగా అన్నప్రసాదాలు, తాగునీరు అందించేందుకు గ్యాలరీల్లో ఫుడ్ కౌంటర్లు ఏర్పాటు చేశారు. ఇక్కడ భక్తులకు టీ, కాఫీ, పాలు, మజ్జిగ, మంచినీరు, సాంబారు అన్నం, పెరుగన్నం, పులిహోర, పొంగలి అందిస్తారు. వాహన సేవలను తిలకించేందుకు వీలుగా ఎల్ఇడి స్క్రీన్లు ఏర్పాటు చేస్తున్నారు. ఇప్పటికే ఆలయ మాడ వీధులను రంగవల్లులతో అందంగా తీర్చిదిద్దారు. ఎండలో నడిచేందుకు ఇబ్బంది పడకుండా వైట్ పెయింట్ వేశారు. భక్తులకు భద్రతా పరంగా ఇబ్బందులు లేకుండా టీటీడీ నిఘా, భద్రతా సిబ్బంది, పోలీసులు, ఎస్‌పిఎఫ్ సిబ్బంది, ఎన్‌సిసి క్యాడెట్లు సేవలందిస్తారు. మాడ వీధుల్లోని గ్యాలరీల్లో భక్తులకు అందుతున్న సౌకర్యాలను పర్యవేక్షించేందుకు సీనియర్ అధికారులకు విధులు కేటాయించారు.

ప్రణాళికాబద్ధంగా సేవలు : టిటిడి ఈవో

తిరుమల: భక్తులకు ఉద్యోగులు సమిష్టిగా, ప్రణాళికాబద్ధంగా సేవలు అందించాలని టిటిడి ఈవో జె శ్యామల రావు కోరారు. తిరుమల ఆస్థాన మండపంలో భక్తులకు సేవలందించేందుకు ఏర్పాటు చేసిన అధికారులు, సిబ్బందిలతో ఆదివారం సమావేశమయ్యారు. ఈ కార్యక్రమానికి టిటిడి ఈవో, టిటిడి అదనపు ఈవో, టిటిడి జేఈవో, ఇన్‌ఛార్జి సివిఎస్‌వో, తిరుపతి ఎస్పీ తదితర అధికారులు హాజరయ్యారు. ఈవో మాట్లాడుతూ ప్రతి గ్యాలరీకి ఇన్‌ఛార్జితో పాటు, అన్ని శాఖల విభాగాల అధికారులకు బాధ్యతలను అప్పగించామని, పోలీసులు, విజిలెన్స్ శాఖలతో సమన్వయం చేసుకోవాలని, భక్తులకు ఎక్కడా ఎలాంటి ఇబ్బందులు రాకుండా అన్నదానం, పోలీసు, విజిలెన్స్, ఇంజనీరింగ్, వైద్య, ఆరోగ్య, శానిటేషన్ తదితర శాఖల అధికారులు, సిబ్బంది ఉమ్మడి కార్యాచరణతో సేవలు అందించాలని కోరారు.



మాట్లాడుతున్న టిటిడి అదనపు ఈవో సిహెచ్ వెంకయ్య చౌదరి

ఉన్నత ప్రమాణాలతో పారిశుధ్య చర్యలు

ఉన్నత ప్రమాణాలతో పారిశుధ్య చర్యలు అందించాలని సూచించారు. అత్యవసర విభాగాల అధికారులు, సిబ్బంది బాధ్యతాయుతంగా, అప్రమత్తంగా పనిచేయాలని, నిబంధనలు పాటించాలన్నారు. 3,500 మంది శ్రీవారి సేవకులు సేవలు అందిస్తారని ఈవో తెలిపారు. అదనపు ఈవో సిహెచ్ వెంకయ్య చౌదరి మాట్లా డుతూ మరింత అప్రమత్తంగా వుండాలని సూచించారు. తిరుపతి ఎస్పీ హర్షవర్ధన్ రాజు మాట్లాడుతూ టిటిడి ఉద్యోగులు, పోలీసు, విజిలెన్స్ ఉద్యోగులు సమన్వయంతో పనిచేసేలా కార్యాచరణ సిద్ధం చేశామన్నారు. ఈ సమావేశంలో టిటిడి జేఈవో వి వీరబ్రహ్మం, ఎఫ్ ఏ అండ్ సీఏవో బాలాజీ, సీఈ సత్యనారాయణ, టిటిడి అధికారు లు, పోలీస్, విజిలెన్స్, శ్రీవారి సేవకులు, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమమే లక్ష్యంగా

ముందుకు సాగుతున్నాం..

జనసేన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కొణిదెల నాగబాబు

ప్రజాశక్తి- సోమల: నూతన కూటమి ప్రభుత్వం ఏర్పడి ఏడు నెలల కాలం అయిందని ప్రజాసంక్షేమమే లక్ష్యంగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ పాలన సాగిస్తున్నారని రాష్ట్ర జనసేన ప్రధాన కార్యదర్శి ప్రధాన కార్యదర్శి కొణిదెల నాగబాబు అన్నారు. మండల కేంద్రమైన సోమలలో ఆదివారం జనంలోకి జనసేన బహిరంగ సభలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసిపి నాయకులను జగన్, పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డిలను తన ప్రసంగంలో తూర్పారబట్టారు. ఏడు నెలల కాలంలో పింఛన్లు, వంటగ్యాస్, గుంతలు పడ్డ రోడ్ల మరమ్మతులు, గిరిజన అభివృద్ధి, ఉచిత ఇసుక, ల్యాండ్ టైటిలింగ్ రద్దు, పలు పరిశ్రమలు తీసుకురావడం, విత్తనాలు ఎరువుల రాయితీ, ఉపాధి హామీ ద్వారా పంచాయతీలలో అభివృద్ధి కార్యక్రమాలు కేంద్రం నుండి కోట్ల రూపాయల నిధులు తీసుకువచ్చి ప్రజాపాలన ప్రజా సంక్షేమాన్ని చేపట్టామని అయితే వైసిపి సన్నాసులు, రౌడీలు, గూండాలు నోటికి వచ్చినట్లు మాట్లాడుతున్నారని వీరందరికీ బుద్ధి చెప్పేందుకు అభివృద్ధి చేసి చూపించి తీరుతామని అన్నారు. పుంగనూరు నియోజకవర్గ శాసనసభ్యులు పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి అక్రమ సంపాదన రెండు లక్షల కోట్లకు పైగా ఉంటుందని ఈ సంపాదన తమ అక్రమ ఆస్తుల విలువ రాష్ట్ర బడ్జెట్‌ను దాటి పోయిందన్నారు. ఎన్నో ఎకరాల భూములు దోచుకోవడం, మదనపల్లి ఫైల్స్ దగ్ధం, పాడి రైతుల దోపిడీ, మైనింగ్ ఇసుక మాఫియా, భూముల ఆక్రమణ, అక్రమ దందా మద్యం, అటవీ శాఖ భూములు ఆక్రమణ, ఎర్రచందనం తరలింపు కోసం రోడ్లు వేయడం వీటన్నిటినీ ఈ ప్రాంత ప్రజలు రాష్ట్ర ప్రజలు గమనిస్తూనే ఉన్నారని ఎంతటి వారినైనా అందరి అరాచకాలను కట్టుబెట్టి అక్రమస్తులను వెలికి తీసి బయటపెడతామని తీవ్ర ఆగ్రహంతో సభలో ప్రసంగించారు.



మాట్లాడుతున్న జనసేన ప్రధాన కార్యదర్శి నాగబాబు

ఖాళీగా కుర్చీలు..

మధ్యాహ్నం బహిరంగ సభకు రాష్ట్ర జనసేన ప్రధాన కార్యదర్శి కొణిదెల నాగబాబు వేదిక మీదకు రాగానే అధిక శాతం మంది మహిళలు ఆయనను చూసి సభ నుండి వెనుతిరిగి వెళ్లిపోయారు. సభాస్థలి వద్ద సగానికి పైగా కుర్చీలు ఖాళీగా దర్శన మిచ్చాయి. పోలీసులు మెటల్ డిటెక్టర్ ద్వారా ప్రతి ఒక్కరిని క్షుణ్ణంగా తనిఖీ చేసి సభాస్థలిలోకి పంపించారు. సోమల ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్య సిబ్బంది సభాసలు వద్ద ఉచిత వైద్యశిబిరాన్ని నిర్వహించారు. బహిరంగ సభకు వచ్చిన అందరికీ భోజన ప్యాకెట్లు అందజేశారు. కార్యక్రమంలో తిరుపతి శాసనసభ్యులు ఆరణి శ్రీనివాసులు, టిడ్కో ఛైర్మన్ వేములపాటి అజయ్ కుమార్, చిత్తూరు జిల్లా జనసేన పార్టీ అధ్యక్షులు పసుపులేటి హరిప్రసాద్, జిల్లా నుండి వచ్చిన పలువురు జనసేన నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.



ఖాళీగా దర్శనమిస్తున్న కుర్చీలు

పిల్లలపై లైంగిక వేధింపులు ఓ సామాజిక, మానసిక సమస్య

- ఆరోగ్యకరమైన కుటుంబ సంబంధాలు ఉండాలి
- పిల్లల రక్షణ వ్యవస్థను బలోపేతం చేయాలి
- 'ప్రజాశక్తి' ఇంటర్వ్యూలో సైకో థెరపిస్ట్ హిప్నో పద్మాకమలాకర్

ఇంటర్వ్యూ

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): సమాజంలో నేడు కలవరపరిచే సంఘటనలు జరుగుతున్నాయి. సామాజిక, మానసిక సమస్యలతో కన్న బిడ్డలపై లైంగిక దాడులు జరగడం అత్యంత తీవ్రమైన సమస్యగా పరిగణించాల్సిన పరిస్థితులు ఉన్నాయి. కంటికి రెప్పలా కాపాడాల్సిన వారే తమ కామ వాంఛను కన్న బిడ్డపై తీర్చుకోవడానికి యత్నించడానికి చాలా కారణాలు వున్నాయి. బాల్య దశలో ఏర్పడే ఈ భయంకరమైన దుశ్చర్య వారి జీవితాలపై తప్పక ప్రభావం చూపుతుందని, దీనికి ఆదిలోనే కొన్ని అవలంబించాల్సిన పద్ధతులను పాటిస్తే బాల్య దశ బంగారు దశగా మారుతుందని ప్రముఖ కౌన్సిలింగ్ సైకో థెరపిస్ట్, హిప్నో థెరపిస్ట్ డాక్టర్ హిప్నో పద్మ కమలాకర్ అన్నారు. తిరుపతి పర్యటనకు వచ్చిన ఆమెను 'ప్రజాశక్తి' పలకరించి చిన్నపిల్లలపై జరుగుతున్న లైంగిక దాడులు, అక్రమ సంబంధాలతో జరుగుతున్న నేరాలపై ముఖాముఖి నిర్వహించింది.

ప్రజాశక్తి: సమాజంలో జరుగుతున్న నేరాలలో అత్యంత దారుణమైన కుటుంబాలకు సంబంధించిన ఘటనలు నిత్యకృత్యమవుతున్నాయి. ఇందుకు కారణం ఏమిటి?

సైకో థెరపిస్ట్: వాస్తవంగా మనదేశంలో సమాజాన్ని ఆలోచింపజేసే, భయాన్ని కలిగించే సంఘటనలు నేడు నిత్యకృత్యం అవుతున్నాయి. కుటుంబంలో ఆరోగ్యకరమైన ఆలోచనలు దూరమై భార్య భర్తల మధ్య చెలరేగే గొడవలు ఘోరమైన హత్యలకు దారి తీస్తున్నాయి. చిన్నపాటి సమస్యలు అయినా, ఒకరిపై ఒకరు నిందారోపణలు చేసుకుంటూ సమస్యను జటిలం చేస్తూ వారికి పుట్టిన పిల్లలను సమాజంలో ఒంటరిని చేసే ఘటనలు జరుగుతున్నాయి. ఇటీవల మనం పరిశీలిస్తే ఓ భర్త తన భార్యను ముక్కలు ముక్కలుగా నరికి కుక్కర్లో ఉడకబెట్టిన సంఘటన యావత్ ప్రపంచాన్ని కలిచి వేసింది. ఇంతటి దారుణమైన ఘటనలకు వారి మానసిక పరిస్థితి ప్రధాన కారణం. మానసిక పరిస్థితులు సరిగా లేనివారు నిపుణులచే తగిన చికిత్సలను పొంది కలిసిమెలిసి జీవించాలి. యాంటీ సోషల్ పర్సనాలిటీ డిసార్డర్ వల్ల ఇతరుల మానసిక స్థితిని అర్థం చేసుకోలేని పరిస్థితులు కల్పిస్తాయి.

ప్రజాశక్తి: చిన్న పిల్లలపై లైంగిక దాడులకు గల కారణాలు ఏమిటి?

సైకో థెరపిస్ట్: ఇది అత్యంత బాధాకరమైన సామాజిక మానసిక సమస్య. చిన్నతనంలో లైంగిక దాడులకు గురైన పిల్లలు రాబోయే రోజుల్లో తీవ్రమైన ఒడిదుడుకులను ఎదుర్కొనే పరిస్థితులు ఏర్పడతా యి. కంటికి రెప్పలా కాపాడా ల్సిన తండ్రి వారి పిల్లలపైనే తన లైంగిక వాంఛను తీర్చుకోవడానికి ప్రయత్నాలు చేయడం దారుణమైన ఘటన. ఇందుకు కారణం ' ఫెడోఫిలియా ' ఇది పిల్లల పట్ల లైంగిక వాంఛను ఆకర్షించే మానసిక రుగ్మతగా చెప్పొచ్చు. ఈ రుగ్మత కలిగిన వ్యక్తి తనకు ఆ సమయంలో కలిగే కామ వాంఛను ఎలాగైనా తీర్చుకోవాలని పరిస్థితులలో కళ్ల ఎదుట ఆడుకునే చిన్నారులపై లైంగిక దాడికి తెగబడతారు. శారీరకంగా ఆరోగ్యంగా ఉన్నా, కొంతమంది మెంటల్ డిసార్డర్స్ తో ఇలాంటి తప్పుడు చర్యలకు దిగుతారు.

ప్రజాశక్తి: పిల్లలపై జరిగే లైంగిక దాడులకు ప్రభుత్వాల బాధ్యత ఎంత?

సైకో థెరపిస్ట్: సమాజంలో భావితరాల భవిష్యత్తుగా పేర్కొనే చిన్న పిల్లలపై అమానుషంగా తమ లైంగిక కోరికలను తీర్చుకోవడానికి జరిగే ఘటనలు నియంత్రించడానికి ఇప్పటికే అమలులో ఉన్న గుడ్ టచ్ – బ్యాడ్ టచ్‌లకు విస్తృత ప్రచార అవగాహనలు కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వాలకు వుంది. పాఠశాలల్లో చదివే బాలికలకు క్రమం తప్పకుండా దీనిపై అవగాహన కల్పిస్తే ఇలాంటి దుశ్చర్యలను ముందుగానే వారు పసిగట్టేందుకు అవకాశం ఉంటుంది. ఆ దిశగా ప్రభుత్వాలు స్పందించాలి. ఇక కుటుంబాల విషయాలకు వస్తే అనారోగ్యకరమైన కుటుంబాలలో పిల్లల పెంపకం, కుటుంబ సభ్యుల ప్రవర్తన మోనిటరింగ్ చేయాలి. బాల్యంలో జరిగే సంఘటనలు వారిని మానసికంగా కృంగదీయడమే కాకుండా, వారి వ్యక్తిత్వ వికాసం పై ప్రభావం చూపుతాయి. పోస్ట్ ట్రామాటిక్ స్ట్రెస్ డిసార్డర్ వల్లల పూర్వపు ఘటనల వల్ల పునరావృత మానసిక బాధ ఉత్పన్నమవుతుంది. ఇది వ్యక్తిపై ప్రభావాన్ని చూపుతూ డిప్రెషన్ లోకి వెళ్లి ఆత్మహత్యలు చేసుకునే పరిస్థితులు ఏర్పడతాయి.

ప్రజాశక్తి: పిల్లల్లో మానసిక స్థితి, కుటుంబాల్లో ఆరోగ్యకరమైన పిల్లల పెంపకానికి దోహదపడే అంశాలను, తీసుకోవ లసిన చర్యలను వివరించండి?



డాక్టరు హిప్నో పద్మా కమలాకర్
కౌన్సెలింగ్ సైకో థెరపిస్ట్, హిప్నో థెరపిస్ట్

సైకో థెరపిస్ట్: కుటుంబంలో పిల్లల మానసిక స్థితిని తల్లిదండ్రులు ఎప్పటికప్పుడు గమనించాలి. పిల్లల్లో వారి మానసిక స్థితి కారణంగా వారి ఎదుర్కొంటున్న సమస్యలను బహిరంగంగా చెప్పుకునే ధైర్యం చాలా వరకు ఆడపిల్లల్లో కనిపించదు. దీన్ని తల్లిదండ్రులు గుర్తించాల్సిన బాధ్యత వుంది. పిల్లలపై లైంగిక దాడులకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకోవాలని ఏర్పాటు చేసిన పోక్సో చట్టం 2012ను కఠినంగా పూర్తి స్థాయిలో అమలు చేయాల్సిన ఆవశ్యకత వుంది. తల్లిదండ్రుల మానసిక సమస్యలు, కుటుంబ సంబంధాల లోపం, లైంగిక అజ్ఞానం వంటి కారణం చేత ఎన్నో దుర్ఘటనలు జరుగుతున్నాయి. దీని నివారణ కోసం చట్టాలను కఠినంగా అమలు చేయడం, తల్లిదండ్రుల మానసిక పరిస్థితిని పరీక్షలు చేయడం, పిల్లలపై లైంగిక దాడుల నియంత్రణకు చేసే అవగాహన కార్యక్రమాలకు సామాజిక మద్దతును కూడగట్టడం వంటివి చేయాలి. పిల్లల భద్రతే సమాజ భవిష్యత్తుగా గుర్తించి తగిన చర్యలు తీసుకోవాలి.

వీధి లైట్లు ఏర్పాటు చేయండి సారూ..

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): మంగళం పరిధిలోని రణధీర్‌పురం గ్రామపంచాయతీలో వీధిలైట్లు లేకుండా ప్రజలు ఇబ్బంది పడుతున్నారని స్థానిక టిడిపి నాయకులు, పంచాయతీ కార్యదర్శి నాగరాజుకు వినతి అందించారు. రాత్రిళ్లు ఇంటికి వచ్చే క్రమంలో వీధిలైట్లు లేకపోవడంతో ప్రమాదాలకు గురవుతున్నామని తెలిపారు.వీధి కుక్కల బెడద, రోడ్లపై గుంటలతో ఇబ్బంది పడుతున్నామని తెలిపారు. త్వరలోనే ఈ సమస్యలకు పరిష్కారం చూపుతామని కార్యదర్శి హామీ ఇచ్చారని టిడిపి నాయకులు తెలిపారు. వినతి ఇచ్చిన వారిలో చంద్ర, టిడిపి యువ నాయకులు అశోక్, గజుల రమణ, వెంకటేష్, జయచంద్ర, ఓబులేష్ ఉన్నారు.

రైతులకు నష్టపరిహారం అందిస్తాం

ప్రజాశక్తి -కోట: సాగరమాల రోడ్డు నిర్మాణ పనులు జరుగుతున్న విషయం తెలిసిందే. ఈ పనుల నిమిత్తం కొంతమంది రైతుల భూములు సాగరమాల రోడ్డుకు కేటాయించడం జరిగింది. అయితే నెల్లూరు పల్లి కొత్తపాలెం గ్రామ సమీపంలో సాగరమాల రోడ్డుకు కేటాయించిన భూములు, చిల్లకూరు మండలం కాకువారిపాలెం గ్రామంలో నివాసం ఉన్న వారికి చెందినవి కావడంతో కోట తాహసిల్దార్ కటారి జయ జయ రావు ఆదివారం 16 మంది బాధిత రైతులను ఆ గ్రామానికి వెళ్లి కలిశారు. రైతులకు చెందిన భూ నష్టపరిహారంతో కాకుండా ప్రస్తుతం పంటకు చెందిన నష్టపరిహారం కూడా అందజేస్తామని తెలియజేశారు. సాగరమాల రోడ్డు నిర్మాణానికి సహకరించాలని వారిని కోరారు. ఈ కార్యక్రమంలో మండల సర్వేయర్ గోపిరెడ్డి, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

తపాలా బీమాను సద్వినియోగం చేసుకోండి

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి : తపాలా శాఖ జీవిత బీమాను ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని శ్రీకాళహస్తి సబ్ డివిజన్ తపాలా శాఖ ఇన్స్పెక్టర్ బాలాజీ శనివారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చల్లపాలెం గ్రామానికి చెందిన రూ.72 వేలు తపాలా జీవిత బీమా చేసుకున్న వంకాయలపాటి హర్షవర్ధన్ ప్రమాదంలో మృతి చెందగా అతని కుటుంబ సభ్యులకు రూ. 6,47,581 లక్షలు బీమా సొమ్ము తపాలా శాఖ చెల్లించిందని తెలిపారు. కావున బీమా విలువ తెలుసుకోవానలి కోరారు. ఈ కార్యక్రమంలో తపాలా శాఖ అధికారులు కుషిత్ బేగం, వాసుదేవ, మురళి, కిరణ్ పాల్గొన్నారు.

ఆర్టీసీ డిపో మేనేజర్‌గా మునిచంద్రయ్య

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి : శ్రీకాళహస్తి ఆర్టీసీ డిపో మేనేజర్‌గా మునిచంద్రయ్య ఆదివారం బాధ్యతలు తీసుకున్నారు. ఈ సందర్భంగా ఆర్టీసీ సిబ్బంది ఆయనకు శుభాకాంక్షలు తెలియజేశారు. శ్రీకాళహస్తి ఆర్టీసీని లాభాల బాటలో నడిపేందుకు సిబ్బంది సహకరించాలని ఆయన విజ్ఞప్తి చేశారు..

హెల్పింగ్ హ్యాండ్స్ సేవలు అభినందనీయం

ప్రజాశక్తి - శ్రీకాళహస్తి: హెల్పింగ్ హ్యాండ్స్ స్వచ్ఛంద సంస్థ సేవలు అభినందనీయమని రాయలసీమ జూనియర్ కళాశాల అధినేత సుబ్బరామిరెడ్డి కొనియాడారు. ఆ సంస్థ ఆదివారం నిర్వహించిన దివ్యాంగుల 158 వ నిత్యావసర సరుకుల పంపిణీ కార్యక్రమానికి సుబ్బరామిరెడ్డి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. నిరుపేదలను ఆదుకోవడంలో హెల్పింగ్ హ్యాండ్స్ వంటి సంస్థలు మరిన్ని ముందుకు రావాలని ఆకాంక్షించారు. హెల్పింగ్ హ్యాండ్స్ సంస్థ సిఫార్సు చేస్తే ప్రతి సంవత్సరం ఇద్దరు పిల్లలకు తమ కళాశాలలో ఫీజు రాయితీ ఉంటుందని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమాలో సంస్థ వ్యవస్థాపకులు మునీర్ బాషా, సభ్యులు గరికపాటి రమేష్ బాబు, గుమ్మల రాజేశ్వరరావు, రవి, బాబా ఫరీద్ తదితరులు పాల్గొన్నారు.

ఎన్ఐసి క్యాంప్ నర్సాపూర్‌కు మహిళా వర్సిటీ విద్యార్థినుల ఎంపిక

ప్రజాశక్తి - క్యాంపస్ : ఈ నెల 3వ తేదీ నుండి 10వ తేదీ వరకు నరసాపూర్‌లో జరుగనున్న ఎన్ఐసి క్యాంప్‌కు శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం విద్యార్థినులు ఎంపికయ్యారని వర్సిటీ ఇన్చార్జ్ విసి ఆచార్య ఉమ, రిజిస్ట్రార్ ఆచార్య ఎన్. రజిని, ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ విద్యావతి తెలిపారు. ఈ సందర్భంగా యూనిట్ 7 నుంచి లావణ్య కుమారి, యూనిట్ 8 నుంచి రీతిగా, ఆంధ్రప్రదేశ్ కంటిన్జెంట్ లీడర్‌గా ఎంపికైన డాక్టర్ డా.వై.అనిత యూనిట్ 16 ప్రోగ్రాం ఆఫీసర్‌లను విసి ఉమ అభినందించారు. ప్రోగ్రాం ఆఫీసర్స్ డాక్టర్ స్వాతి, డాక్టర్ మాధవిలు వారికి శుభాకాంక్షలు తెలిపారు.


కంటి వైద్య శిబిరానికి విశేష స్పందన

ప్రజాశక్తి - నాగలాపురం: ఆదివారం సాయిబాబా ఆలయంలో నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరానికి విశేష స్పందన వచ్చిందని చాగంటి గౌరీ శంకర్, సీఈఓ సీతారామనాయుడులు తెలిపారు. చాగణం లలితమ్మ భాస్కరరావు మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో, తిరుపతి శ్రీ వెంకటేశ్వర అరవింద్ నేత్రాలయ హాస్పిటల్ వారిచే ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించామన్నారు. ఈ సందర్భంగా ట్రస్ట్ డైరెక్టర్ గౌరీ శంకర్ మాట్లాడుతూ కంటి సమస్యలకు అనుభవజ్ఞులైన వైద్యుల ఆధ్వర్యంలో పరీక్షలు నిర్వహించామన్నారు. ఈ శిబిరంలో 120 మందికి పరీక్షలు చేయగా, 50 మందికి మందులు పంపిణీ చేసి, 35 మందికి ఉచితంగా కంటి అద్దాలను అందించామన్నారు. మిగిలిన వారికి ట్రస్టు ద్వారా ఉచితంగా ఆపరేషన్ చేస్తున్నట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ ఏవో కృష్ణాగల్లా, అరవింద్ నేత్రాలయ సిబ్బంది గౌరీ శంకర్, సాయిబాబా ఆలయ నిర్వాహకులు జగదీష్ రెడ్డి, కన్నెప్ప మొదలియార్, సుగుణ రాముడు, విజయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

మహర్షి సేవా సంస్థచే క్రీడా పోటీలు

ప్రజాశక్తి - తిరుపతి సిటీ : నెహ్రూ యువ కేంద్ర సంఘటన్ వారి ఆర్థిక సహకారంతో మహర్షి అభ్యుదయ సేవా సంస్థ ఆధ్వర్యంలో ఆదివారం బ్లాక్ లెవెల్ ఆటల పోటీలు నిర్వహించారు. స్థానిక యూత్ హాస్టల్‌లో జరిగిన కార్యక్రమంలో లెమన్ అండ్ స్పూన్, షటిల్, వాలీబాల్, మ్యూజికల్ చైర్స్ పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో గెలిచిన వారిని జిల్లాలో స్థాయి క్రీడా పోటీలలో పాల్గొనడానికి అర్హత సాధించినట్లుగా నెహ్రూ యువ కేంద్ర జిల్లా అధికారి, యూత్ కోఆర్డినేటర్ ప్రదీప్ కుమార్ తెలియజేశారు. మాస్ సంస్థ అధ్యక్షులు జ్ఞాన శేఖర్ రెడ్డి సహకారమందించిన వారికి ధన్యవాదాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో యూత్ హాస్టల్ మేనేజర్ మోహన్ రెడ్డి, అవిలాల సర్పంచ్ వెంకటరమణ, తదితరులు పాల్గొన్నారు.

సుబ్బమ్మ మృతికి విద్యానాథరెడ్డి నివాళి



సుబ్బమ్మ మృత దేహం వద్ద నివాళి అర్పిస్తున్న విద్యానాథరెడ్డి

ప్రజాశక్తి - బుచ్చినాయుడు కండ్రిగ: పల్లమాల హరిజనవాడకు చెందిన వైసీపీ సీనియర్ నాయకుడు పెంచలయ్య తల్లి సుబ్బమ్మ శనివారం రాత్రి మృతి చెందారు. విషయం తెలుసుకున్న వైయస్ ఆర్సీపీ మండల కన్వీనియర్ ఆరని విద్యానాథరెడ్డి పల్లమాల గ్రామానికి వెళ్లి సుబ్బమ్మ పార్థవదేహానికి నివాళులు అర్పించారు. వారి కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపి, పెంచలయ్య కుటుంబానికి వైయస్ఆర్సీపీ పార్టీ తోడుగా ఉంటుందని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కాటూరు ఎంపీటీసీ రవికుమార్, కారణమెట్ట ఎంపీటీసీ రమణయ్య, వెస్ట్ వరత్తూరు సర్పంచ్ సుప్రియ దయాకర్, వైసిపి నాయకుడు బాల శేఖర్, వైఎస్ఆర్సిపి సీనియర్ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

యండీయు వాహనాల నిలిపివేత.. రేషన్ అందక వెత

నిత్యావసర వస్తువులు పంపిణీ చేసే ఎండియు మినీ వాహనాలు ఆగిపోవడంతో సరుకులు పంపిణీ సరిగా జరగక ప్రజలు అవస్థలు పడుతున్నారు. మూడు నెలల క్రితం మండలంలో 15 మినీ వాహన పంపిణీదారులలో అయిదుగురు సరుకులు పంపిణీ చేయలేమని రాజీనామా చేశారు.



పుత్తూరు సివిల్ సప్లై గోడౌన్‌లో నిల్వ ఉంచిన కందిపప్పు

ప్రతినెల 20వ తేదీ నుంచి 30వ తేదీ లోపు పుత్తూరు, వడమాల పేట, నారాయణవనం మండలాలకు సరుకులను విధిగా రేషన్ షాప్ డీలర్లకు పంపిణీ చేస్తున్నాము. ఈనెల కోటగా 109 షాపులకు బియ్యం- 600 క్వింటాళ్లు, చక్కెర- 20 క్వింటాళ్లు, కందిపప్పు -40 క్వింటాళ్లు పంపిణీ చేశాము. సరుకులు వినియోగదారులకు చేరవేసే బాధ్యత రేషన్ షాపు డీలర్లదే.
- గోడౌన్ డిటి ముని వేలు

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్: నెల నెలా రేషన్ అందించే వాహనాల లేకపోవడంతో మున్సిపాలిటి పరిధిలోని గేట్ పుత్తూరు, లక్ష్మి నగర్, నందిమంగళం, రూరల్‌పరిధిలో గోపాల కృష్ణా పురం, పరమేశ్వర మంగళం గ్రామాలలో ప్రత్యామ్నాయంగా ఆయా పరిధుల్లో రేషన్ షాపులకు పంపిణీ బాధ్యత అప్పగించారు. రూరల్ ప్రాంతాలలో రేషన్ సరుకులు సక్రమంగా అందుతున్నప్పటికీ, పట్టణంలో మాత్రం ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ప్రభుత్వ నిబంధనల మేరకు వినియోగదారులు బయోమెట్రిక్ ద్వారా ఏ రేషన్ షాపు లేక మినీ వాహనాల నుంచి అయినా సరుకులను తీసుకోవచ్చు. సరుకు వచ్చిన వెంటనే వేరే వీధిలోని, ఇతర కాలనీలోని వినియోగదారులు కూడా తీసుకోవడంతో స్టాక్ అయిపోవడంతో ఆ ప్రాంతంలోని వినియోగదారులు డీలర్లను ఉన్న చోటును వెతుక్కుంటూ వెళ్లాల్సి వస్తోంది. ముఖ్యంగా గేట్ పుత్తూరు ప్రజలు సరుకులు అందక, ఆ నెల కోటా వదులుకోవాల్సి వస్తోంది. ఫిబ్రవరి నెలలో 24 వ వార్డు డీలర్ రజినికి తెలియకుండానే డీలర్‌షిప్ రద్దు చేశారు. దీంతో లక్ష్మీ నగర్, బెస్త వీధి, కాపు వీధి, బందలదొడ్డి వినియోగదారులకు ఎక్కడ నిత్యవసర సరుకులు ఇస్తున్నారో కూడా తెలియని పరిస్థితి. కొందరు రేషన్ డీలర్లు వినియోగదారులకు కందిపప్పు పంపిణీ చేయడం లేదు.

ఘనంగా ఎఐ రోబోటిక్ ఎగ్జిబిషన్



ఏఐ రోబోటిక్ ఎగ్జిబిషన్ ప్రారంభిస్తున్న ప్రైవేటు విద్యాసంస్థల రీజినల్ జోనల్ ప్రెసిడెంట్ విశ్వనాథరెడ్డి

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : పుత్తూరు పట్టణ కాపు వీధిలోగల స్వామి వివేకానంద పాఠశాల విద్యార్థులు తయారు చేసిన పరికరాలతో ఎఐ రోబోటిక్ ఎగ్జిబిషన్ ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ప్రైవేటు విద్యాసంస్థల రీజినల్ జోనల్ ప్రెసిడెంట్ విశ్వనాధ రెడ్డి, జిల్లా ప్రెసిడెంట్ ఓబుల రమణారెడ్డి, సాయి జ్యోతి కళాశాల కరెస్పాండెంట్ రమేష్‌లు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రస్తుత సమాజ అవసరాలకు సాంకేతికత ఎంతో అవసరమన్నారు. అందుకు అనుగుణంగా విద్యార్థి దశలో నుంచే ఎఐ సాంకేతికతను అభివృద్ధి చేయడం అభినందనీయమన్నారు. అనంతరం అతిథులను పాఠశాల కరస్పాండెంట్ సదాశివం, డైరెక్టర్ సాహిత్య ఘనంగా సన్మానించారు, ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఎన్నికల హామీలు నెరవేర్చమని అడిగితే అరెస్టులా..?



సమావేశంలో మాట్లాడుతున్న నేతలు

ప్రజాశక్తి - క్యాంపస్ : విద్యా రంగ సమస్యల పరిష్కారినికి నిరసన తెలిపిన అన్నమయ్య జిల్లా ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి మాధవ్‌ను అక్రమంగా అరెస్టు చేయడాన్ని ఏఐఎస్ఎఫ్ తిరుపతి జిల్లా అధ్యక్ష కార్యదర్శులు ఉదయ్ కుమార్, ప్రవీణ్ కుమార్‌లు ఖండించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు తీరుపై అసహనం వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా ఆఫీస్ బేరర్స్ చంద్రనాయక్ , మోహన్, నగర నాయకులు సుబ్బు, ఓం రాజ్, గ్రేస్, విష్ణు, శివ తదితరులు పాల్గొన్నారు.

స్థూల దేశీయోత్పత్తి పెంపు దిశగా బడ్జెట్

మధ్య తరగతికి లాభదాయకం : ప్రముఖ ఛార్టెడ్ అకౌంటెంట్ వి.భాగ్యతేజ



ప్రజాశక్తి - తిరుపతి సిటీ : స్థూల దేశీయోత్పత్తి (జిడిపి)ని పెంచి వికసితభారత్ గా అభివృద్ధి చేసేందుకు వీలుగా కేంద్ర ప్రభుత్వం బడ్జెట్ ప్రవేశపెట్టిందని స్విమ్స్ చీఫ్ అకౌంట్స్ ఆఫీసర్ గోపి దేవరకొండ వెల్లడించారు. పబ్లిక్ రిలేషన్స్ సొసైటీ ఆఫ్ ఇండియా(పిఆర్ఎస్ఐ) తిరుపతి చాప్టర్ ఆధ్వర్యంలో ఆదివారం తిరుపతి న్యూబాలాజి కాలనీలోని గ్రీన్ హోమ్ డెవలపర్స్ కార్యాలయంలో బడ్జెట్-2025పై అవగాహన సదస్సు జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన గోపి దేవరకొండ మాట్లాడుతూ భారత్ రానున్న రోజుల్లో 5 ట్రిలియన్ డాలర్ల ఎకానమీ దిశగా వృద్ధి చెందేందుకు అడుగులు వేస్తోందన్నారు. ఇందులో భాగంగా పన్నుల్లో అనేక సంస్కరణలు తెచ్చిందని చెప్పారు. దేశానికి పట్టుగొమ్మలైన గ్రామాలు, వ్యవసాయం అభివృద్ధి చెందేందుకు పెద్దపీట వేసిందన్నారు. తయారీ రంగంలో యువతను, మహిళలను ప్రోత్సహించేందుకు పలు పథకాలను ప్రవేశపెట్టిందని చెప్పారు. ప్రముఖ ఛార్టెడ్ అకౌంటెంట్ వి.భాగ్యతేజ మాట్లాడుతూ ఆదాయ పన్ను స్లాబ్ 12 లక్షలకు పెంచడం సంతోషకరమన్నారు. దీనివల్ల నగదు చలామణి పెరుగుతుందని, మార్కెట్లో నగదు పెరిగితే చిన్న వ్యాపారాలు చేసే మధ్యతరగతి ప్రజలకు మేలు కలుగుతుందన్నారు. యూపీఐ చెల్లింపులు పెరుగుతుండడంతో చిన్న వ్యాపారాలు చేసేవారు కూడా జీఎస్టీ పరిధిలోకి వచ్చే అవకాశం ఉందన్నారు. ఉద్యోగులు, వ్యాపారులు ప్రతి సంవత్సరం జూలై 31 లోపు ఇన్‌కంటాక్స్ రిటర్న్ ఫైల్ చేయాలని సూచించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ ఉద్యోగులు, ఇతర రంగాల్లోని ఉద్యోగులు, చిరు వ్యాపారులు, పెద్ద వ్యాపారవేత్తలకు వర్తించే పన్నులు, పన్ను మినహాయింపునకు ఉన్న మార్గాలను తెలియజేశారు. అనంతరం బడ్జెట్‌లోని ముఖ్యాంశాలను తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పిఆర్ఎస్ఐ తిరుపతి చాప్టర్ అధ్యక్షుడు కె.శ్రీనివాసరావు, కార్యదర్శి దుద్యాల చంద్రమోహన్, కోశాధికారి ఆచార్య చక్రవర్తి రాఘవన్, కార్యవర్గ సభ్యులు ఆర్‌సికె.రాజు, మధుసూదన్, రాజేష్, మాజీ ఛైర్మన్లు డా.స్వరాజ్యలక్ష్మి, డా.ఎన్.బి.సుధాకర్ రెడ్డి, జాతీయ కౌన్సిల్ సభ్యులు హర్షవర్ధన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జాతీయ విజ్ఞాన ప్రదర్శనలో మేటిగా నిలిచిన శ్లోక-ఎ బిర్లా స్కూల్



విద్యార్థులను అభినందిస్తున్న పాఠశాల యాజమాన్యం

ప్రజాశక్తి-రామచంద్రాపురం(చంద్రగిరి): అమేతి అంతర్జాతీయ పాఠశాల, సెక్టార్ 46, గురుగ్రామ్, హర్యాన నందు సీబీఎస్ఇ- జాతీయ విజ్ఞాన ప్రదర్శనలో తిరుపతి జిల్లా, చంద్రగిరి మండలం తొండవాడ సమీపంలో ఉన్న బిర్లా ఓపెన్ మైండ్స్ ఇంటర్నేషనల్ స్కూల్, విద్యార్థులు పాల్గొని విజేతలుగా నిలిచారు. ఆదివారం విజేతలైన విద్యార్థులకు పాఠశాల యాజమాన్యం అభినందనలు తెలియజేశారు. ఈ ప్రదర్శనలో 28 రాష్ట్రాలు, ఎనిమిది కేంద్ర పాలిత ప్రాంతాల నుండి ఔత్సాహికులు పాల్గొనగా శ్లోక ఏ బిర్లా స్కూల్ విద్యార్థులు ప్రదర్శించిన ఆర్టిఫిషియల్ రైపనర్ డిటెక్టర్(రసాయనాలతో మాగబెట్టిన పండ్లను గుర్తించే పరికరం) ప్రాజెక్టు అందరి మన్ననలు పొంది విజేతగా నిలిచింది. యావత్ ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రానికి ప్రాతినిధ్యంగా నిలిచిన పాఠశాల విద్యార్థులు బాలాదిత్య, కేతన్ క్రిష్, మెంటార్ ఎమ్. సతీష్ గర్వించదగ్గ విజయాన్ని అందించినందుకు పాఠశాల యాజమాన్యం అభినందించారు. డైరెక్టర్ శ్రీవత్సవ, ప్రిన్సిపల్ వీణవాణి, ఉపాధ్యాయులు ప్రత్యేక శుభాకాంక్షలు తెలియజేస్తూ విద్యార్థులలో సాంకేతిక పరిజ్ఞానాన్ని పెంపొందించే దిశగా కృషి చేస్తామని తెలియజేశారు.

హలో మాదిగ.. చలో హైదరాబాద్

ప్రజాశక్తి - బుచ్చినాయుడు కండ్రిగ: 7 తేదీన హైదరాబాద్ కేంద్రంగా జరుగు లక్షల డప్పులు-వేల గొంతులు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎంఆర్‌పిఎస్ తిరుపతి జిల్లా కార్యదర్శి ఎర్రమల్లి సాయి పిలుపునిచ్చారు. మందకృష్ణ మాదిగ ఆదేశాల మేరకు, కమిటీ సభ్యులు జగదీష్ మాదిగ అధ్యక్షతన, పార్లపల్లి మాదిగ పల్లెలో సన్నాహక కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధులుగా ఎమ్మార్పియస్ రాష్ట్ర ఉపాధ్యక్షులు సూరిపాక వాసుదేవరావు హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ అభినవ అంబేద్కర్, మహా జన నేత మందకృష్ణ మాదిగ షెడ్యూల్డ్ కులాల వర్గీకరణ చట్ట బద్ధతకై గత 30 సంవత్సరాలుగా అలుపెరుగనిపోరాటం చేస్తున్నారన్నారు. సుప్రీం కోర్ట్ షెడ్యూల్డ్ కులాల వర్గీకరణ చట్ట బద్ధత చేసుకునే హక్కు రాష్ట్రాలకు ఉందని స్పష్టం చేసిందని తెలిపారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఎస్సీ రిజర్వేషన్‌ల వర్గీకరణ చట్ట బద్ధత చేయడానికి వన్ మాన్ కమిషన్ వేసిందని తెలిపారు. చైర్మన్ రాజీవ్ రంజన్ మిశ్రా రాష్ట్రంలోని 13 జిల్లాలు తిరిగి షెడ్యూల్డ్ కులాల జీవన స్థితిగతులపై, ఆర్థిక స్థితిగతులపై విజ్ఞప్తులను స్వీకరించారని తెలియ చేశారు. మాదిగ, మాదిగ ఉపకులాల వైపు ప్రపంచం మొత్తం చూసే విదంగా మందకృష్ణ మాదిగ ఆధ్వర్యంలో 7వ తేదీన హైదరాబాద్ కేంద్రంగా జరుగు లక్షల డప్పులు - వేల గొంతులు కార్యక్రమాన్ని విజయవంతం చేయడానికి సత్యవేడు నియోజకవర్గంలోని 7 మండలాల నుండి మాదిగ, మాదిగ ఉపకులాల యువత, విద్యార్థులు, నిరుద్యోగులు, రాజకీయ పార్టీలకు అతీతంగా ప్రతీ ఒక్కరూ డప్పు తీసుకుని హైదరాబాద్‌కు తరలి రావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ మండల కమిటీ సభ్యులు వంశి, బాలాజీ, శ్రీరాములు, మురళి, చైతన్య, బద్రిలు పాల్గొన్నారు.

ఎర్ర జెండా పోరాటాల ఫలితమే చట్టాలు

ప్రజాశక్తి - తిరుపతి సిటీ : ఎర్రజెండా పోరాటాల ఫలితంగానే దేశంలో అనేక చట్టాలు వచ్చాయని,పేద ప్రజలకు, కార్మికుల, కర్షకుల మహిళా విద్యార్థి, యువజనులకు రక్షణగా ఉంటున్నాయని సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఏ.రామానాయుడు అన్నారు. అలాంటి చట్టాలను నేటి ప్రభుత్వాలు నీరుగారుస్తూ, దుర్వినియోగం చేస్తున్నాయని దుయ్యబట్టారు. ఆదివారం తిరుపతి రెండవ డివిజన్లోని కామ్రేడ్ కృష్ణారెడ్డి నగర్‌లో సిపిఐ శతవసంత వార్షికోత్సవాల సందర్భంగా కామ్రేడ్ కృష్ణారెడ్డి స్థూపానికి పూలమాలలు వేసి, జెండా ఆవిష్కరణ నిర్వహించడం జరిగింది. అనంతరం రామానాయుడు మాట్లాడుతూ సీపీఐ చేసిన పోరాటాలను, విజయాలను వివరించారు. ఈ సభలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు చిన్నం పెంచలయ్య, కే.రాధాకృష్ణ, బి నదియా, నగర కార్యదర్శి జె.విశ్వనాథ్, నగర కార్యవర్గ సభ్యులు బండి చలపతి, ఎన్.డి.రవి, ఎన్.శివ, కే.వె. రాజా, ఎం.రామకృష్ణ, ఎన్ మంజుల వివిధ ప్రజా సంఘాల నాయకులు వైయస్ మణి, గోవిందస్వామి, జే.నాగరాజు, అల్లా బక్షు, బి.నాగభూషణం, సుబ్బు , భాష, ప్రమీల, భాగ్య తదితరులు పాల్గొన్నారు.

చంద్రగిరిలో డప్పుల మోత

ప్రజాశక్తి - రామచంద్రపురం (చంద్రగిరి): డప్పులు శబ్దాలతో చంద్రగిరి మారుమోగింది. చంద్రగిరి జాతీయ రహదారిలోని ఫ్లైఓవర్ నుంచి క్లాక్ టవర్ వరకు ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో డప్పు కళాకారులతో వేల గొంతులు.. లక్షల డప్పుల కార్యక్రమంలో భాగంగా డప్పుల వాయిస్తూ భారీ ర్యాలీ నిర్వహించారు. క్లాక్ టవర్ వద్ద గోడపత్రికను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా తిరుపతి జిల్లా ఎమ్మార్పీఎస్ అధ్యక్షులు వేలూరు రాజేంద్ర మాదిగ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎస్సి వర్గీకరణ కోసం అహర్నిశలు శ్రమించిన ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు మందకృష్ణ మాదిగకు కేంద్ర ప్రభుత్వం పద్మశ్రీ ప్రకటించడం ఎంతో ఆనందదాయకమన్నారు. ప్రభుత్వం ఎస్సీ వర్గీకరణకు ఏకసభ్య కమిషన్ కేటయించడం శుభపరిణామన్నారు. ఎస్సీ వర్గీకరణ వలన అన్ని ఉప కులాలకు సమన్యాయం జరుగుతుందని వివరించారు.ఈనెల 7వ తేదీన హైదరాబాద్ ఎల్బీ స్టేడియంలో జరగనున్న వేల డప్పులు, లక్ష గొంతుకుల కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా సీనియర్ నాయకులు పులిగుంట్ల గోపి మాదిగ, ఎంఎస్పి చంద్రగిరి నియోజకవర్గ ఇన్చార్జి బోయినపల్లి రవిమాదిగ, లాయర్ల పెడరేషన్ జిల్లా కన్వీనర్ సంగీతం రామ్మూర్తి మాదిగ, విద్యార్థి సంఘ నాయకులు సద్దల నవీన్ మాదిగ, వివిధ మండల నాయకులు ఓబులేష్, లక్ష్మయ్య, అంజయ్య డప్పు కళాకారులు పాల్గొన్నవారు.

జిల్లా విద్యార్థి విభాగం అధ్యక్షులుగా చెవిరెడ్డి హర్షిత్ రెడ్డి ప్రమాణ స్వీకారం

ప్రజాశక్తి - తిరుపతి సిటీ : ఉమ్మడి చిత్తూరు, తిరుపతి జిల్లాల వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ విద్యార్థి విభాగం అధ్యక్షులుగా నియమితులైన చెవిరెడ్డి హర్షిత్ రెడ్డి ఆదివారం ప్రమాణ స్వీకారం చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ జననేత జగనన్న ఆదేశాల మేరకు జిల్లా పదవులు స్వీకరించిన వారంతా కష్టపడి పోరాడాలన్నారు. అనంతరం జిల్లా కమిటీకి ఎన్నికైన నాయకులు ప్రమాణ స్వీకారం చేశారు.

ఘనంగా ఘంటసాల పాటల పోటీలు

ప్రజాశక్తి - తిరుపతి సిటీ : ఘంటసాల 'ది గ్రేట్' చిత్రం విడుదల వుతున్న సందర్భాన్ని పురస్కరించుకొని, రాష్ట్ర స్థాయి ఘంటసాల పాటల పోటీలు ఆదివారం వేమన విజ్ఞాన కేంద్రంలో నిర్వహించారు. సుమారు 40 మంది గాయనీ గాయకులు ఈ పోటీలో పాల్గొన్నారు. మూడు విభాగాల్లో మొదటి బహుమతి15000, రెండవ బహుమతి 10000, మూడవ బహుమతి 5000 రూపాయలతో పాటు కన్సోలేషన్ ఒక్కొక్కరికి రూ.500 అందజేశారు. ఈ కార్యక్రమంలో ఘంటసాల అభిమానులు, సహృదయ సంస్థ అధినేత పీ.రాజేష్, వై .అరవింద్, తదితరులు పాల్గొన్నారు.

నేడు కుప్పం బాదూరు సబ్‌స్టేషన్ పరిధిలో విద్యుత్ అంతరాయం

ప్రజాశక్తి-రామచంద్రపురం: మండలంలోని కుప్పం బాదూరు విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో సోమవారం ఉదయం 9 గంటల నుండి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ అంతరాయం ఏర్పడనున్నట్లు అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ గిరి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. నూతన పవర్ ట్రాన్స్ఫార్మర్లు ఏర్పాటు చేస్తున్నందున విద్యుత్ అంతరాయం ఏర్పడుతుందని తెలిపారు. కుప్పం బాదూరు సబ్‌స్టేషన్ పరిధిలో మిట్ట కండ్రిగ, కొత్త కండ్రిగ, పరమాల, సికేపల్లి, ఎన్ ఆర్ కమ్మపల్లి, రాయలచెరువు పేట గ్రామాల విద్యుత్ వినియోగదారులు సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

ప్రగతి సేవా సంస్థ సేవలు అభినందనీయం

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : ప్రగతి సేవా సంస్థ అధ్యక్షులు కడివేటి చంద్రశేఖర్, లక్ష్మి దేవి 28వ వివాహ వార్షికోత్సవం సందర్భంగా బాలాజీ నగర్ లోని ప్రగతి సేవా సంస్థ కార్యాలయంలో వివాహ వార్షికోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. అనంతరం వివాహ వార్షికోత్సవ కేక్ కట్ చేసి, 50 మంది నిరుపేద మహిళలకు చీరలు, చికెన్ బిర్యాని పంపిణీ చేయడం జరిగింది. ప్రగతి కుటుంబ సభ్యులు, ఆత్మీయులు వారిని సన్మానించి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మయూరి శ్యామ్ యాదవ్, ప్రగతి సేవా సంస్థ కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

బీసీ కార్పొరేషన్ రుణాలకు దరఖాస్తు చేసుకోండి

- కోట ఎంపిడిఓ ఏకొల్లు వేణు

ప్రజాశక్తి -కోట : బీసీ కార్పొరేషన్ రుణాలకు దరఖాస్తు చేసుకోవాలని కోట ఎంపిడిఓ వేణు కోరారు. స్థానిక ఎంపిడిఓ కార్యాలయం వద్ద ఆయన మాట్లాడుతూ బీసీ కులానికి చెందిన వారు7వ తేదీ లోపల ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. 21 నుండి 60 సంవత్సరాల లోపు వారు మాత్రమే అర్హులని తెలిపారు. కుల ధ్రువీకరణ పత్రం, రేషన్ కార్డు, వయసు ధ్రువీకరణ పత్రం, ఆధార్ కార్డు, బ్యాంకు ఖాతాలతో ఓ పి ఓ, బిఎంఎంఎస్ వెబ్సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. ఆన్ లైన్‌లో అప్లై చేసుకున్న దరఖాస్తు పత్రాలను సంబంధిత సచివాలయ కేంద్రాలలో సమర్పించాలన్నారు.

క్రైం న్యూస్

భార్యను పొడిచి.. భర్త ఆత్మహత్యాయత్నం

ప్రజాశక్తి - నాయుడుపేట: భార్యను కత్తితో పొడిచి, భర్త ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ఘటన నాయుడుపేట పట్టణంలో కలకలం రేపింది. పట్టణంలోని కుమ్మరి వీధిలో నివాసముంటున్న అవగోల సురేష్, అతని భార్య లత తరచూ గొడవలు పడుతుండే వారు. ఈ క్రమంలో వారి గొడవ పోలీస్ స్టేషన్ వరకు వెళ్లగా, పోలీసులు రాజీ కుదిర్చి పంపించారు. అయినప్పటికీ వీరిద్దరి మధ్య ఈ గొడవలు ఆగక మరింత పెద్దవయ్యాయి. శనివారం రాత్రి పది గంటల సమయంలో సురేష్ లతపై కత్తితో దాడి చేసి, తీవ్రంగా గాయపరిచాడు. ఆపై తను కూడా పొడుచుకుని ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. వీరి కేకలు చుట్టుపక్కల వారు గమనించి వారిని ప్రైవేట్ వైద్యశాలకు తీసుకెళ్లగా డాక్టర్లు పరిశీలించి మెరుగైన వైద్యం కోసం నెల్లూరుకు తరలించారు.

గోడ కూలి భవన నిర్మాణ కార్మికుడు మృతి



మృతి చెందినపుత్తేటి పాపయ్య

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : శిధిలావస్థలో ఉన్న గోడ కూలి, భవన నిర్మాణ కార్మికుడు పుత్తేటి పాపయ్య మృతి చెందిన ఘటన వెలుగు చూసింది. తిమ్మన గారి పాలెం గ్రామానికి చెందిన పుత్తేటి పాపయ్య, తూర్పు గూడూరుకు చెందిన అయితా నావూరయ్యలు శనివారం గోడ మరమ్మతు పనులు చేస్తుండగా, అకస్మాత్తుగా శిధిలావస్థలో ఉన్న గోడ కూలి వారిపై పడిపోయింది. తీవ్ర గాయాల పాలైన వారిని ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ పుత్తేటి పాపయ్య మృతి చెందిడు. మరొక కార్మికుడు నావూరయ్యకు తీవ్ర గాయాలయ్యాయి. మృతి చెందిన కార్మికుడి కుటుంబానికి రూ.10 లక్షలు సహాయం చేయాలని సి.ఐ.టి.యు భవన నిర్మాణ సంఘ నాయకులు డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో సి.ఐ.టి.యు భవన నిర్మాణ సంఘం గౌరవాధ్యక్షులు జోగి శివకుమార్, బి.వి. రమణయ్య, ఎస్.సురేష్, పుట్టా శంకరయ్య, రఫీ, ఆర్.ఎస్.కె. జిలాని, బి.చంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

ఆటోను ఢీకొట్టిన గుర్తు తెలియని వాహనం

ఆటో డ్రైవర్ మృతి

ప్రజాశక్తి-రామచంద్రపురం (చంద్రగిరి): చంద్రగిరి మండలం, పూతలపట్టు నాయుడుపేట జాతీయ రహదారిలో తొండవాడ సమీపాన ఆటోను గుర్తు తెలియని వాహనం ఢీకొట్టడంతో ఆటో డ్రైవర్ రవి(44) అక్కడికక్కడే మృతి చెందాడు. శనివారం రాత్రి గాదంకి నుండి తిరుపతికి ఆటో నడుపుతుండగా తొండవాడ సమీపాన సి మల్లవరం జంక్షన్ వద్ద తిరుపతి నుంచి వేగంగా వచ్చిన గుర్తు తెలియని వాహనం ఢీకొట్టడంతో రవి ఆటోలో ఇరుక్కుపోయి మృతి చెందాడని స్థానికులు తెలిపారు. చంద్రగిరి పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని రవి మృతదేహాన్ని తిరుపతి రుయా హాస్పిటల్ కు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సుమన్ తెలిపారు.

కుటుంబ కలహాలతో వేణుంబాకం సర్పంచ్ ఆత్మహత్య



మృతి చెందిన సుబ్రహ్మణ్యం (ఫైల్ ఫోటో)

ప్రజాశక్తి -దొరవారిసత్రం : తిరుపతి జిల్లా, దొరవారిసత్రం మండల పరిధిలోని వేణుంబాకం గ్రామ సర్పంచ్ మానికల సుబ్రహ్మణ్యం (62) కుటుంబ కలహాలతో ఆత్మహత్య చేసుకుని మృతి చెందారు. గ్రామస్తుల వివరాల మేరకు గత కొన్ని నెలలుగా భార్య భర్తల మధ్య మనస్పర్థలు ఉన్నట్లు, భార్య పుట్టింటికి వెళ్లడంతో సర్పంచ్ మానసికంగా ఆవేదన చెందుతూ ఉండేవాడిని చెప్పారు.ఈ నేపథ్యంలోనే అతను ఆదివారం ఉదయం రసాయనిక గుళికలు మింగి గ్రామ సమీపంలో ఉన్న చింతాలమ్మ దేవాలయ సమీపంలో మృతి చెందినట్లు గ్రామస్తులు తెలిపారు.

గుర్తు తెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతి



మృతి చెందిన పున్నేపల్లి దశరథరామయ్య

ప్రజాశక్తి, నాయుడుపేట: గుర్తు తెలియని వాహనం ఢీకొని, రోడ్డు పక్కన నిలుచున్న వ్యక్తి మృతి చెందిన ఘటన నాయుడుపేట, మల్లం కూడలి వద్ద ఆదివారం సాయంత్రం జరిగింది. నాయుడుపేట సీఐ బాబి ఘటనా స్థలికి వెళ్లి దర్యాప్తు చేశారు. పోలీసుల వివరాలు మేరకు మృతుడు దొరవారిసత్రం మండలం, నెల్లబల్లి గ్రామానికి చెందిన పున్నేపల్లి దశరథరామయ్యగా గుర్తించారు. అతని వద్దనున్న ఫోన్ ద్వారా కుటుంబీకులకు సమాచారం అందించారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని నాయుడుపేట ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.